ఆర్భాటంగా నిర్మించి.. అసంపూర్తిగా వదిలేసి

- నిరుపయోగంగా చెత్త నుంచి సంపద కేంద్రాలు
- రూ.లక్షల ప్రజాధనం వృథా
- వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్న ప్రజలు



ముంచంగిపుట్టులో అసంపూర్తిగా సంపద కేంద్రం

ముంచంగిపుట్టు: చెత్త నుంచి సంపద తయారీ చేయాలనే ఉద్దేశ్యంతో మండలంలో 23 పంచాయతీలకుగాను 18 పంచాయతీల్లో లక్షలు వెచ్చించి నిర్మించిన సంపద తయారీ కేంద్రాలు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. ప్రతి పంచాయతీలోనూ ఆయా గ్రామాల గ్రామస్తులకు తడి, పొడి చెత్తను వేరు చేసి గ్రీన్ అంబాసీడర్‌లకు ఇచ్చేందుకు వీలుగా ప్రతి ఇంటికి రెండు ప్లాస్టిక్ బుట్టలను అందజేశారు. సేకరించిన చెత్తను సంపద కేంద్రాలుగా తరలించేందుకు ప్రత్యేకంగా కొంతమంది అంబాసీడర్‌లను నియమించారు. ప్రచార ఆర్భాటంతో అట్టహాసంగా ఈ సంపద కేంద్రాలకు ముంచంగిపుట్టు మండలం మొత్తం 18 పంచాయతీలకు గానూ రూ.50లక్షలు పైగా మంజూరు చేసింది. మండలంలో కర్రిముఖిపుట్టు, బంగారుమెట్ట, పనసపుట్టు, జోలాపుట్టు, కిలగాడ పంచాయతీల్లో ఈ కేంద్రాలు నిర్మాణాలు పూర్తయ్యాయి. మిగిలిన పంచాయతీల్లో నిర్మాణాలు అసంపూర్తిగా వదిలేశారు. 9 పంచాయతీల్లో స్థల సమస్య వల్ల నిర్మాణాలు ప్రారంభించలేదు. సంపద కేంద్రాల నుంచి వర్మీ కంపోస్ట్ తయారు చేస్తారని దానిని రైతులకు తమ పంట పొలాల్లో వేయుటకు ఉపకరిస్తుందని ప్రచారం సైతం చేశారు. రసాయన ఎరువుల వినియోగం వల్ల భూమి నిస్సారవంతమవుతుంది, అందుచేత సూక్ష్మ పరంగా వర్మి కంపోస్ట్ తయారు చేసేందుకు వీలుంటుంది. ఇది నిరంతరం జరిగే ప్రక్రియ కాబట్టి సంపద కేంద్రాలను పంచాయతీల్లో అభివృద్ధి చేసేందుకు వీటిని నిర్మించేందుకు చర్యలు తీసుకున్నారు. ఉపాధి హామి పథకంలో షెడ్డు, ప్లాట్‌ఫారమ్, స్టోర్ రూమ్ ఏర్పాటుకు నిధులు మంజూరు చేశారు. ఈ సౌకర్యాలను పూర్తతే పంచాయతీలకు వీటి నిర్వహణ అప్పగిస్తారని అధికారులు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. కానీ ఆచరణలో ఇది అమలు కాలేదు. నిర్మించిన సంపద కేంద్రాలు ప్రారంభానికి నోచుకోక అలంకారప్రాయంగా దర్శనమిస్తున్నాయి. మరికొన్ని నిర్మాణంలోనే అసంపూర్తిగా నిలిచిపోయాయి. రైతులకు ఉపయోగకరంగా సంపద కేంద్రాలు అందుబాటులోకి తెస్తామని అధికారులు అనుకున్న లక్ష్యాన్ని నెరవేర్చలేకపోయారు. ఇప్పటికైనా సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకొస్తే మేలు చేకూరుతుందని ప్రభుత్వం, ఉన్నతాధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవాలని మండల వాసులు కోరుతున్నారు.



నిరుపయోగంగా దర్శనమిస్తున్న కుండీలు



బంగారుమెట్టలో ప్రారంభానికి నోచుకోని సంపద కేంద్రం

నిర్లక్ష్యానికి నిదర్శనం



మండలంలో సంపద కేంద్రాల పరిస్థితి గత అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం. లక్షలు వెచ్చించి నిర్మాణాలు చేపట్టి నిరుపయోగంగా వదిలేశారు. దీంతో రైతులకు ఉపయోగపడతాయని భావించిన కేంద్రాలు ఎటువంటి లాభం చేకూర్చలేదు. కేవలం కాంట్రాక్టర్‌లకు మాత్రం లాభాలు చేకూర్చాయి. వీటిపై ప్రభుత్వం దృష్టి పెడితే రైతులకు లాభం చేకూరుతుంది.

– కె.త్రినాథ్, సర్పంచ్, లక్ష్మీపురం పంచాయతీ, ముంచంగిపుట్టు మండలం

సమస్య పరిష్కారానికి చర్యలు



చెత్త సంపద తయారీ కేంద్రాలు పంచాయతీల ద్వారా నిర్వహణ జరగాలి. కొన్ని నిర్మాణాలు పూర్తి కాగా మరికొన్ని అసంపూర్తిగానే మిగిలిపోయాయి. కొన్ని ఇంకా పనులు ప్రారంభానికి నోచుకోలేదు. వీటి ద్వారా రైతులకు లబ్ధి చేకూరేందుకు అవకాశం ఉంది. సంపద కేంద్రాల సమస్యను పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటాం.

– సూర్యనారాయణమూర్తి, ఎంపీడీవో, ముంచంగిపుట్టు

భక్తిశ్రద్ధలతో అమ్మవారికి పూజలు



వేడుకలో పాల్గొన్న భక్తులు

రాజవొమ్మంగి: రాజవొమ్మంగి శివారులో ఉత్తరం వైపు కొండదిగువ ప్రాంతంలో కొలువైన మాల కొండమ్మ అమ్మవారి పండుగను గ్రామస్తులు గురువారం భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. వర్షాలు కురవాలని, పంటలు బాగా పండాలని కోరుకొంటూ ఏటా ఇక్కడ పండుగ జరుపుకోవడం స్థానికుల ఆనవాయితీ. ఈ సందర్భంగా రోజంతా ఉపవాసం ఉన్న మహిళలు ఊరేగింపుగా తమ ఇళ్ల నుంచి పసుపు కుంకుమలు, పండ్లు, రకరకాల పిండి వంటలు తీసుకొని వచ్చి అమ్మవారికి నివేదించారు. దీపధూపాలతో విశేష పూజలు జరిపారు. అదే ప్రాంతంలో పొయ్యి ఏర్పాటు చేసి ఆవు పాలతో పాయసం వండి అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించారు. అమ్మవారి ప్రతిరూపాలుగా మట్టి బరిణెలను ఉంచి భక్తులు పూజలు చేశారు. గ్రామ పెద్దలు పెద్దిరాజు తదితరులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

ఆక్రమణలను తొలగించాలి

కొయ్యూరు: అనేక గ్రామాల్లో చెరువులు, పచ్చికబయళ్ల పొంత రహదారులు, అడవికి వెళ్లే దారులు ఆక్రమణలకు గురవుతున్నాయని, ఉన్నతాధికారులు వాటిపై దృష్టి సారించి ఆక్రమణలు తొలగించాలని రాజేంద్రపాలెం పీసా కమిటీ ఉపాధ్యక్షుడు కాకర స్వామినాయుడు, పంచాయతీ కార్యదర్శి గోకిరి చిన్నారావు కోరారు. వారు గురువారం విలేకరులతో మాట్లాడుతూ చెరువులు ఇటీవల కాలంలో ఎక్కువగా ఆక్రమణలకు గురువుతున్నాయన్నారు. ఆక్రమణదారుల నుంచి వాటిని రక్షించాలని కోరారు. హైకోర్టు ఆదేశాల ప్రకారం రోడ్ల ఆక్రమణలను కాకుండా ఇతర ఆక్రమణలను తొలగించాలని కోరారు.

క్లుప్తంగా

దోమతెరల పంపిణీ



దోమతెరలను పంపిణీ చేస్తున్న సర్పంచ్, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి శ్రీకాంత్

కొయ్యూరు: మండలంలోని రాజేంద్రపాలెం పంచాయతీ సోలాబులో గురువారం మువ్వ చినబాపిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సర్పంచ్ పిటా సింహాచలం దోమతెరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న రామ్‌కీ ఫౌండేషన్ విశాఖ జోన్ ప్రాంతీయ అధికారి కె.శ్రీకాంత్ మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా చినబాపిరెడ్డి ఫౌండేషన్ సేవా కార్యక్రమాలు చేస్తుందన్నారు. ఇందులో భాగంగా నిరుద్యోగ యువతకు శిక్షణను కూడా ఇస్తుందన్నారు. అల్లూరి జిల్లాలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేయాలని ఆయన కోరారు. సంస్థ మహిళా కో–ఆర్డినేటర్ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పథకాలు సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో బాపన్నదొర

వై.రామవరం: మండల కేంద్రంలోని గ్రామ సచివాలయంలో గురువారం ఎంపీడీవో కె.బాపన్నదొర అధ్యక్షతన ప్రధానమంత్రి దర్తీ అభాజన జాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్ పథక గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతు ఈ పథకం ముఖ్యోద్దేశ్యం, అర్హులు, లబ్ధిదారుల గుర్తింపు, లబ్ధిపొందే విధానం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. పథకాల వివరాలను తెలియజేశారు. అనంతరం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గ్రామంలోని గర్భిణులకు సామూహిక సీమంతాలు చేశారు. ఎంపీటీసీ వీరమళ్ల సుబ్బలక్ష్మి, ఈవోపీఆర్‌డీ డి.శివకుమార్, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, ఐసీడీఎస్ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ కరువు



వైస్ ఎంపీపీ భాగ్యవతి

ముంచంగిపుట్టు: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలోనే మహిళలకు రక్షణ, భద్రత లేదని వైస్ ఎంపీపీ సిరగం భాగ్యవతి అన్నారు. ఆమె గురువారం విలేకరులతో మాట్లాడుతూ కుప్పం నియోజకవర్గంలో శిరీష అనే మహిళను చెట్టుకు కట్టేసి దాడి చేయడం అమానుషమని, చంద్రబాబు ఇలాకాలో ఓ మహిళపై ఇంతటి ఘటన జరిగితే, ఇక రాష్ట్రంలో పరిస్థితి ఎలా ఉంటుందో ఇట్టే అర్థం చేసుకోవచ్చనన్నారు. కూటమి పాలనలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని, రాష్ట్రంలో ప్రతి రోజు మహిళలపై ఎక్కడో చోట దాడులు జరుగుతున్నాయన్నారు. మహిళలు రోడ్లుపై రావాలంటేనే భయపడాల్సిన పరిస్థితి నెలకొందన్నారు.గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నాటి ముఖ్యమంత్రి జగనన్న ప్రత్యేక చట్టాలు తీసుకువచ్చి మహిళలకు అన్ని విధాలుగా భద్రత కల్పించారని, దిశ మహిళ పోలీసు స్టేషన్ ఏర్పాటు చేశారని, మహిళలకు అన్ని విధాలుగా అండగా నిలిచారని గుర్తు చేశారు. కానీ నేడు కూటమి ప్రభుత్వంలో సభ్య సమాజం తలదించుకొనే సంఘటనలు జరుగుతున్నాయని స్పష్టం చేశారు. మహిళలకు అన్ని విధాలుగా రక్షణ కల్పించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.

రోడ్డు కోసం వినతి



జీసీసీ చైర్మన్ శ్రావణ్ కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

గూడెంకొత్తవీధి: గుర్రాలగొందికి సీసీ రోడ్డు మంజూరు చేయాలని గ్రామస్తులు గురువారం జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్‌కి వినతిపత్రం అందజేశారు. రోడ్డు లేకపోవడంతో వారు ఎదుర్కొంటున్న అవస్థలను ఆయనకు వివరించారు. రహదారి వేస్తే సమస్యల తొలగుతాయన్నారు. ఆయన దీనిపై సానుకూలంగా స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారని గ్రామస్తులు కిల్లో రాజేంద్ర, రాజారావు, స్వామి తదితరులు తెలిపారు.

వైభవంగా అమ్మవారి జాతర

మాడుగుల: ఖండివరం వెళ్లేదారిలో వెలసిన మరిడిమాంబ జాతర గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్రామాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. జాతర నిర్వహించడం వల్ల పంటలు బాగా పండుతాయని, ఈ ప్రాంత రైతుల విశ్వాసం.

ప్రత్యేక డీఎస్సీపై సీఎం ప్రకటన చేయాలని డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

పాడేరు రూరల్: ఆదివాసీ స్పెషల్ డీఎస్సీపై సీఎం స్పష్టమైన ప్రకటన చేయాలని ఆదివాసీ స్పెషల్ డీఎస్సీ సాధన కమిటీ కో–కన్వీనర్ ధర్మనపడాల్ తెలిపారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతు గిరిజన స్పెషల్ డీఎస్సీపై ఆదివాసీ స్పెషల్ డీఎస్సీ సాధన కమిటీ పలుమార్లు ఉద్యమాలు చేస్తున్నా కూటమి ప్రభుత్వం స్పందించకపోవడం కక్షపూరితమైన రాజకీయమేనన్నారు. అయిదవ షెడ్యూల్ గిరిజన ప్రాంతంలో ఆదివాసీలకే నూరుశాతం ఉద్యోగాలు అని చెప్పుతునే ఆదివాసీలకు అన్యాయం చేస్తున్నారన్నారు. గిరిజన చట్టాలు హక్కులు ఉన్నప్పటికీ గిరిజన ప్రాంతాల్లో గిరిజనేతరులకు ఉద్యోగ అవకాశాలు కల్పించే విధంగా ప్రభుత్వాలు వ్యవహరించడం హాస్యస్పదంగా ఉందన్నారు. ఇటీవల ప్రభుత్వ ఉన్నతాధికారులతో పాటు గిరిజన మంత్రితో చేసిన చర్చలు కూడా పాలకులే నీరుగార్చరన్నారు. ఈనెల 21న విశాఖలో నిర్వహించే యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా వస్తున్న ప్రధాన మంత్రికు ఆదివాసీ స్పెషల్ డీఎస్సీ సాధన కమిటీ కలిసేందుకు కూటమి ప్రభుత్వం, ఉన్నతాధికారులు అనుమతులు ఇప్పించాలని, లేని పక్షణ కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా శాంతియుతంగా నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు, కో–కన్వీనర్ రాధాకృష్ణ, నాయకులు సత్యనారాయణ, చిరంజీవి, భాను, రాజుబాబు తదితరులు పాల్గొన్నారు.

'పాఠశాల తెరిపించండి.. మా పిల్లలకు చదువు చెప్పండి'

- బల్లుగూడలో నేటికీ తెరుచుకోని సర్కారు బడి
- చదువుకు దూరమవుతున్న చిన్నారులు
- ఆందోళనలో తల్లిదండ్రులు



తెరుచుకోని బల్లుగూడ పాఠశాల ఎదుట నిరీక్షిస్తున్న విద్యార్థులు

ముంచంగిపుట్టు: మండలంలోని బాబుశాల పంచాయతీ బల్లుగూడ గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వేసవి సెలవులు పూర్తయినా నేటికీ తెరుచుకోలేదు. ఈ నెల 12వ తేది నుంచి పాఠశాలలు పునఃప్రారంభం అయినప్పటికీ పాఠశాల మూసే ఉండడంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులు పాఠశాలకు వెళ్తే తలుపులకు తాళం వేసి ఉండడం, ఉపాధ్యాయులు రాకపోవడంతో విద్యార్థులు ఇంటి బాట పడుతున్నారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ బొంజుబాబు, బల్లుగూడ గ్రామస్తులు రాంబాబు, శంకరరావు, లక్ష్మణరావు, సన్యాసిరావులు గురువారం విలేకరులతో మాట్లాడుతూ గత వారం రోజులుగా సుమారు 60 మంది విద్యార్థులు పాఠశాలకు వచ్చి తలుపులకు తాళం వేసి, గదులు మూసి ఉండడంతో ఇంటికి వచ్చేస్తున్నారన్నారు. ఈ పాఠశాలలో 2024 సెప్టెంబర్ నుంచి 2025 ఏప్రిల్ వరకు ఇన్‌చార్జి ఉపాధ్యాయుడు, భాష వలంటీర్‌తో పాఠశాల నిర్వహణ జరిగిందన్నారు. పాఠశాల ప్రారంభం నుంచి ఉపాధ్యాయులు, భాష వలంటీర్ రావడంలేదని, తమ పిల్లలు చదువుకు దూరం అవుతున్నారని చిన్నారుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యాశాఖ ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి ఉపాధ్యాయులు వచ్చి, పాఠశాల తెరిచే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయంపై ఎంఈవో కృష్ణమూర్తిను వివరణ కోరగా గతంలో ఇన్‌చార్జి ఉపాధ్యాయుడుని నియమించడం జరిగిందని, త్వరలోనే మరొక ఉపాధ్యాయుడుని నియమించనున్నట్టు తెలిపారు.

అక్రమ మైనింగ్‌పై చర్యలకు డిమాండ్



కమిషనరేట్ డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్‌కు ఫిర్యాదు చేస్తున్న ఆదివాసీ సంక్షేమ పరిషత్ సంఘం సభ్యులు

రంపచోడవరం: రంపచోడవరం ఐటీడీఏ పరిధిలో అనేక అక్రమ మైనింగ్ జరుగుతున్నాయని, వాటిపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో విజయవాడలో గనులు, భూగర్భశాఖ కమిషనరేట్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్‌కి గురువారం ఫిర్యాదు చేశారు. ఏజెన్సీ ప్రాంతంలో అమాయక ఆదివాసులను ఆసరాగా చేసుకొని తప్పుడు అనుమతులు పొంది మైనింగ్ నిర్వహిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో గ్రామసభ ఆమోదం మేరకు ఆదివాసీల సొసైటీతో మైనింగ్ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఏజెన్సీలో గిరిజనేతరుల మైనింగ్ నిర్వహించడానికి అర్హత లేదని కాని తప్పుడు గ్రామసభ తీర్మానాలు చేస్తూ రెవెన్యూ అధికారులు ఎన్‌వోసీలు ఇస్తున్నారని ఆరోపించారు. గిరిజన సొసైటీకి ప్రత్యేక బ్యాంకు అకౌంట్ ఏర్పాటు కార్యకలాపాలు నిర్వహించాలన్నారు. మైనింగ్ ద్వారా వచ్చిన ఆదాయంలో 20శాతం ఆయా ప్రాంతాల అభివృద్ధికి కేటాయించాలన్నారు. ఆ దిశగా ఎటువంటి చర్యలు జరగడం లేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి అక్రమ మైనింగ్‌కు అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేశారు.

కళాశాలలో ప్రవేశాలు ప్రారంభం



ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఈశ్వరప్రసాద్

రాజవొమ్మంగి: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఈశ్వరప్రసాద్ కోరారు. ఈ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీలలో 44 చొప్పున సీట్లు ఉన్నట్టు చెప్పారు. కాగా ఆయా గ్రూపుల్లో ఇంకా 100 సీట్లు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ ఏడాది పదో తరగతి ఉత్తీర్ణత పొందిన విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికేట్లు, ఆధార్, మూడు పాస్‌పోర్టు సైజు ఫోటోలతో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఇందుకు గాను సైన్సు సబ్జెక్టులకు రూ.2,610, ఆర్ట్స్‌కు రూ.1,620 ఫీజు చెల్లించి ఈ నెల 30వ తేదీ లోగా ప్రవేశం పొందవచ్చని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఈశ్వరప్రసాద్ సూచించారు. కళాశాలలో ఒకేషనల్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని, గిరిజన బాలికలకు హాస్టల్ సదుపాయం ఉన్నట్టు తెలిపారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన



యార్లగడ్డలో ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నేతలు

వై.రామవరం: ప్రధాని మోదీ నేతృత్వంలో కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం 11 ఏళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా మండలంలోని యార్లగడ్డ గ్రామంలో పార్టీ నాయకులు కారం సీతారామన్నదొర(ఢీల్లీబాబు) పర్యవేక్షణలో మండల పార్టీ అధ్యక్షుడు ఆదివిష్ణ అధ్యక్షతన వికసిత్ భారత్ అమృత్‌కాల సంకల్ప సభను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించారు. అన్ని సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సర్పంచ్ పల్లాల పద్మావతి, నాయకులు కృష్ణారెడ్డి, వెంకటరమణారెడ్డి, మంగాదేవి, విశ్వరెడ్డి, వీరప్రతాప్‌దొర, విశ్వరెడ్డి, పండురెడ్డి, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు మొక్కల పంపిణీ



మొక్కలు పంపిణీ చేస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

గూడెంకొత్తవీధి: నాబార్డు సహకారంతో మొక్కలు పంపిణీ చేసినట్టు గిరిజన వికాస్ సంస్థ కార్యదర్శి ఎస్.వి.సత్యనారాయణ గురువారం ప్రకటనలో తెలిపారు. మండలంలోని దేవరాపల్లి, గూడెంకొత్తవీధి ప్రాంతాల్లోని 16 గ్రామాల్లోని 500 మంది రైతులను ఈ ప్రాజెక్టులో భాగంగా ఎంపిక చేశామన్నారు. అగ్రహారం, వాడమామిడి, ఎర్రగెడ్డ, మల్లికార్జునుడు, లక్కవరం, నీలవరం, డేరాల గ్రామాల్లో ప్రస్తుతం పంపిణీ చేశామన్నరు. మొక్కలు పాడైతే రైతులు తమను సంప్రదిస్తే తిరిగి మొక్కలు ఇస్తామన్నారు. మొక్కలు నాటేందుకు వాతావరణం అనుకూలంగా మారడంతో ఇప్పుడు వాటిని వేయిస్తున్నామన్నారు. ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ గాలి అనంతలక్ష్మి, మర్రి కృష్ణ, వానపల్లి జోగిరాజు, మొట్టడం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



విజేత జట్టుకు నగదు చెక్కును అందజేస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి జమాల్‌ఖాన్

చింతూరు: మండలంలోని కుమ్మూరులో జరిగిన క్రికెట్ పోటీల్లో విజేతగా నిలిచిన చింతూరు యూఎఫ్‌సీ జట్టుకు జమాల్‌ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జమాల్‌ఖాన్ నగదు బహుమతితో పాటు ట్రోఫీని అందజేశారు. 80 టీంలు పాల్గొన్న ఈ టోర్నమెంటుకు ట్రస్ట్ తరపున ఆయన రూ.70 వేల నగదు బహుమతిని ప్రకటించారు. ఇందులో భాగంగా గురువారం జరిగిన ఫైనల్లో చింతూరు యూఎఫ్‌సీ జట్టు పెదార్కూర్ జట్టుపై విజయం సాధించి విజేతగా నిలిచింది. విజేత జట్టుకు రూ.40 వేల నగదును జమాల్‌ఖాన్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ క్రీడల్లో రాణించాలని సూచించారు. క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. గ్రామపెద్దలు అనిగి చంద్రయ్య, చిన్నబ్బి, రాము, హరి, శివ, నారాయణ, భద్రయ్య, కన్నారావు పాల్గొన్నారు.

యోగా సాధనకు సమయం కేటాయించాలి



అరకులోయలో యోగాసనాలు వేస్తున్న ప్రిన్సిపాల్ భరత్ కుమార్ నాయక్ తదితరులు



ర్యాలీ నిర్వహిస్తున్న డిగ్రీ విద్యార్థులు

అరకులోయటౌన్: యోగాసాధనకు విద్యార్థులు ప్రతీ రోజు కొంత సమయాన్ని కేటాయించాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భరత్ కుమార్ నాయక్ అన్నారు. ఈనెల 21న విశాఖ వేదికగా నిర్వహించే యోగాంధ్రలో భాగంగా యోగాపై అవగాహన కల్పించి, అనంతరం అరకులోయ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.
ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడారు. రోజు యోగా సాధన ద్వారా ఆరోగ్యవంతులుగా ఉండవచ్చన్నారు. యోగ శిక్షకురాలు వై.విజయలక్ష్మి యోగాసనాలు చేయించారు.ఎన్ఎస్ఎస్ పీవోలు పి.నాగబాబు, ఎం.అనిత కుమార్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కొండబాబు, పీడీ ఎస్.అప్పారావు, అధ్యాపకులు గణేష్, కామేశ్వరరావు, లచ్చన్న, రాజు, సోంబాబు, సునీల్ విద్యార్థులు పాల్గొన్నారు.



జీకేవీధిలో యోగాసనాలు వేస్తున్న మహిళలు

కె.కొడిసింగిలో యోగా ప్రదర్శన

గూడెంకొత్తవీధి: మండలంలోని కె.కొడిసింగి గ్రామంలో గురువారం బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బొండ్ల చిరంజీవి ఆధ్వర్యంలో యోగాసనాల కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ యోగాతో మంచి ఆరోగ్యం, మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ప్రతీ ఒక్కరు యోగా చేయాలని కోరారు.

సికిల్‌సెల్ ఎనీమియాపై అవగాహన



కూనవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కూనవరం: సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పించాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రాజీవ్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం సికిల్ సెల్ ఎనీమియా వ్యాధిపై అవగాన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వ్యాధి వంశపారంపర్యంగా వచ్చే అవకాశాలున్నాయన్నారు. ముఖ్యంగా గిరిజనులలో ఈ వ్యాధి ఎక్కువగా ఉంటుందని పరీక్షల ద్వారా గుర్తించి మందులు క్రమం తప్పకుండా వాడాలని సూచించారు. అలాగే ప్రజల్లో విస్తృతంగా అవగాన పెంపొందించాలన్నారు. హెల్త్ సూపర్‌వైజర్ డి.శ్రీనివాసరావు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఎంపీ హెచ్‌ఏ (మేల్), ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో రైతులకు మేలు



కిలగాడలో రైతులకు వరి విత్తనాలు అందజేస్తున్న ఏవో మురళీకృష్ణ

ముంచంగిపుట్టు: గిరిజన రైతులు ప్రకృతి వ్యవసాయం చేయడం ద్వారా ఎంతో మేలు కలుగుతుందని మండల వ్యవసాయశాఖాధికారి ఎం.మురళీకృష్ణ అన్నారు.మండలంలో కిలగాడ పంచాయతీ కేంద్రంలోని రైతు సేవా కేంద్రం వద్ద గురువారం వరి విత్తనాలు పంపిణీ కార్యక్రమం వ్యవసాయ శాఖాధికారులు నిర్వహించారు. ఏవో మురళీకృష్ణ, సర్పంచ్ శివశంకర్ చేతుల మీదగా వరి విత్తనాలను రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఏవో మురళీకృష్ణ మాట్లాడుతూ గిరిజన రైతులు లాభాలు వచ్చే పంటలపై దృష్టి పెట్టాలన్నారు. వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు ,సలహాలు పాటించి, పంటలు వేస్తే దిగుబడి వస్తుందని సూచించారు. 90 శాతం రాయితీపై వరి విత్తనాలు రైతు సేవ కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. వ్యవసాయశాఖ అధికారులు, సచివాలయ సిబ్బంది, గిరిజన రైతులు పాల్గొన్నారు.